పనిదినం

— దిట్ల దేవదానం రాజు

పల్లె పట్టున ఉన్న ఆ బడి పొగమారిన వంటిల్లులా ఉంటుంది. రంగు వెలసిన బ్లాక్‌బోర్డు లాంటి పెచ్చులూడిన గోడలు... బూజుపట్టిన పైకప్పులోంచి తొంగి చూస్తున్న సాలీడులు... చెదలు పట్టిన దేశపటాలు... విరిగి ముక్కలైన బల్లలు... ముడతలు పడ్డ ముసిల్దాన్లాంటి పాతకాలం నాటి బడి. బడికి వెళ్ళే దారే గతుకులు. తప్పని లీకేజీల్లాంటి గోతుల్ని దాటుకుంటూ వెళ్ళాలి. అరగని సుద్దముక్కల్లా మేం మస్తూ పోతూ ఉంటాం.

అదొక అప్పర్ ప్రైమరీ స్కూలు. తరగతులు ఏడు. విద్యార్థులు నాలుగు వందల మంది. అయిదుగురే ఉపాధ్యాయులు. వరండాలో రెండు క్లాసులు. వీటికి వర్షం ఎండ దయ ఉండాలి. విద్యార్థులు నేలమీద కూర్చోడానికి బల్లలుండవు. నేలమీద దేకాలి. సంతకం కోసం హెడ్‌మాస్టారు రూముకెళ్ళాను. ''రండ్రండి! ఈవేళ మనిద్దరం లాగాలి బండిని. రావు మెడికల్ లీవు పెట్టారు. నెల వరకూ రారు. శివార్లలోని సింగిల్ టీచర్ స్కూళ్ళు దాపురించాయి మన ప్రాణానికి. శర్మ, సుబ్బారావులకు డిప్యుటేషను. ఇదో తప్పని తద్దినంలా ఉంది. నిన్న మీరు రాలేదు కదా, అదీ సంగతి'' వాసుదేవరావుగారు గడగడా చెప్పేశారు.

తల పంకించి మౌనంగా రిజిస్టర్‌లో సంతకం చేశాను.

పుస్తకాలు తీసుకుని క్లాసుకి వెళ్ళడానికి లేచాను. ''మీరొక నాలుగు క్లాసులు - నేనొక మూడు క్లాసులు. మనమేం చెబుతాం. వాళ్ళేం నేర్చుకుంటారు. మన శ్రాద్ధం వాళ్ళ పిండాకూడు. పశువుల్ని కాసినట్లు కాయడమే'' అంటూ నాతో బాటు బయటకొచ్చారు. ''వొరేయ్! మాట్లాడకండి. మాట్లాడేరంటే చంపేస్తాను'' పెద్ద పెద్ద అంగలు వేసుకుంటూ వెళ్ళిపోయారు. వరండాలో సర్దుకున్న పిల్లలు ఫుట్‌బోర్డ్ పట్టుకుని వేలాడుతున్న బస్సు ప్రయాణీకుల్లా ఉన్నారు. అంతా గోలగోలగా ఉంది. రెండో పక్క మైదానం వైపునకు వచ్చి గదవరాండాంచారం. సద్దుమణిగింది. ఒక్కో క్లాసుకు వెళ్ళి హాజరువేయడం పూర్తిచేశాను. క్లాసు లీడరుకు గొడవ చెయ్యకుండా చూడమని చెప్పాను.

పదిన్నరయ్యింది.

ఏడవ తరగతికెళ్ళాను. ఏడవ తరగతికి కామన్ పరీక్షలు. సిలబస్ సకాలంలో పూర్తవ్వాలి. లేకపోతే అధికారుల నుంచి సంజాయిషీలు వస్తాయి. ఇంగ్లీషు పాఠం మొదలెట్టాను. చుట్టూ గోడలు లేని హాలులాంటి ప్రదేశం. గట్టిగా మాట్లాడినా ముందు వరుసలో పిల్లలకే వినిపిస్తుంది. నా దృష్టి వెంకటలక్ష్మిపై పడింది. ఆ పిల్లంటే నాకెంతో జాలి. క్రమం తప్పకుండా బడికి రావడంవల్ల ప్రతి క్లాసు పాసవుతుంది. విచిత్రం ఏమిటంటే అక్షరాల్ని కూడబలుక్కుని తప్ప చదవలేదు. బుద్ధిగా పాఠం వింటుంది. విషయం అర్థమవుతున్నట్లు బుర్రూపుతుంది. ఏమడిగినా మాట్లాడదు. తిట్టవలసింది పిల్లల్నో విద్య విధానాన్నో తెలియడం లేదు. ప్రతిభతో నిమిత్తం లేదు. డెబ్బై అయిదు శాతం హాజరుంటే చాలు. ఇంకా అందులో పది వాతం తక్కువొచ్చినా హెడ్‌మాస్టారు కండోన్ చేసి ప్రమోట్ చేయొచ్చు. నిర్దేశించిన కోర్సు నియమిత కాలంలో పూర్తయితే చాలు. పిల్లలకు వచ్చిందో లేదో అనవసరం. చాలా స్కూళ్ళలో విద్యార్థి పేరు పై తరగతిలో ఉంటుంది. భౌతికంగా కుర్రాడు కింది తరగతిలో ఉంటాడు. కొన్ని మారుమూల స్కూళ్ళలో పిల్లలు రాకపోయినా హాజరు వేయాలి. హాజరు పడిపోతే పోస్టు ఎత్తేస్తారు. పోస్టు ఎత్తేస్తే సర్పంచ్ ఊరుకోడు. ఉపాధ్యాయుల్నే తప్పు పడతారు. ఇదొక విషవలయం.

గేటు వైపునకు చూస్తే జీపు కనపడింది. ఎమ్మీవో వచ్చినట్లున్నారు. విద్యార్థుల అవగాహన శక్తి గొప్పది. అధికారులొచ్చినట్లు గ్రహిస్తే తపస్సు చేసుకుంటున్న మునులై పోతారు.

హెడ్‌మాస్టారు నుంచి రమ్మని కబురు. నిశ్శబ్దంగా ఉండమని హెచ్చరించి వెళ్ళాను.

ఎమ్మీవో గార్ని విష్‌చేసి నిలబడ్డాను.

''నేనెవరను కుంటున్నారయ్యా! కల్టెరు నాకు బాస్. నేను మీకు బాస్‌ను. నేను రాగానే ఇక్కడకు రావాలని తెలియదా? మిమ్మల్ని గట్టిగా ఏమీ అనకూడదు. మొన్నా మధ్య మునుపాడు సింగిల్ టీచరు సెలవు కోసం ఆఫీసుకొచ్చాడు. నేనేదో మూడ్‌లో ఉండి మాట వరసకు సస్పెండ్ చేస్తానన్నాను. అంతే! వాడు స్పృహ తప్పి పడిపోయాడు. ముఖం మీద నీళ్ళు కొట్టి టీ ఇచ్చాను. అతగాడికి బి.పి. గీ.పి ఉన్నాయంట. నాకేం తెలుసు? అప్పటి నుండి ఆఫీసుకొచ్చిన టీచర్లకు రాగానే కూర్చోబెట్టి మంచినీళ్ళిచ్చి అతిథి మర్యాదలు చేస్తున్నాను. జాగ్రత్తగా మాట్లాడుతున్నాను'' ఎమ్మీవో మోహనరావుగారు ఏవో మాట్లాడేస్తున్నారు.

మోహనరావు గురించి కొంత చెప్పుకోవాలి. ఈయన చాలా ధైర్యసాహసాలు కలవాడని చెప్పుకుంటారు. రూల్సు పరిధిలోనే అతి చాకచక్యంగా డబ్బులు పిండుకోగలడు. ఎప్పుడూ టక్ చేసుకుని చిత్రమైన జోకులేస్తూ విదూషకుడిలా ఉంటాడు. పాఠశాల తనిఖీకి వేరే విద్యాధికారులుంటారు. అయినా ఈయన స్కూళ్ళకు వెళతాడు. ఎర్రగా బుర్రగా కంటికి నదురుగా ఉన్న లేడీ టీచర్లున్న స్కూళ్ళకు మరీ ఎక్కువసార్లు వెళ్తాడు. అనవసర పిచ్చి ప్రశ్నలేస్తాడు. వాళ్ళు లోపల ఏమనుకున్నా అప్పటికి భరించి తర్వాత నవ్వుకుంటారు.

కూల్‌డ్రింక్ తెచ్చిన కుర్రాడు టేబుల్ మీద పెట్టాడు. ''ఎవరు తెప్పించమన్నారు? నేనడిగానా? ఎందుకయ్యా డబ్బులు వేస్టు చేస్తారు? నన్నడిగి తెప్పించొచ్చు కదా! ఇపుడు తాగకపోతే బాధపడ్తావు'' విసుక్కున్నారు ఆయన. వాసుదేవరావు ''ఫర్వాలేదు సార్! దీన్లో ఏముంది'' అంటూ మూతతీసి అందించారు.

సగం పైగా తాగి టేబుల్ మీద పెట్టారు.

ఒక్కసారి ఆ బాటిల్‌వైపు చూసి ''దాన్లోంచి కొంత డ్రింక్ తాగాను. ఇంకా కొంచెం మిగిలింది. సరే ఆ మిగిలిందాన్ని ఏమంటారో చెప్పండి'' అంటూ మా వంక చూశారు.

మేమిద్దరం మాట్లాడలేదు.

''మీ ఇద్దరిలో ఎకనామిక్స్ ఎవరు చదివారు? వినియోగదారుని మిగులు అంటారు. ఏం పంతుళ్ళయ్యా మీరు. చదివిన చదువులు మరిచిపోతే పిల్లలకి పాఠాలు ఎలా చెబుతారు? జీవితాంతం గుర్తుండాలి. అసలు నేనెపుడు చదివానో తెలుసా?'' అంటూ తన ధోరణిలో మాట్లాడేస్తున్నారు.

వినియోగదారుని మిగులు అంటే ఏమిటో సరైన నిర్వచనం చెబుదాం అనుకున్నాను. వాసుదేవరావుగారి సైగ అర్థం చేసుకుని మౌనంగా ఉండిపోయాను. ''ఆఫీసులో సంతకాలు పెట్టలేక చెయ్యి లాగేస్తుందంటే నమ్మండి? అందుకే రిలీఫ్‌గా ఇలా వచ్చేస్తుంటాను'' తనెందుకు రావాల్సి వచ్చిందో చెప్పుకు పోతున్నారు. కాసేపు అవీ ఇవీ మాట్లాడారు.

పన్నెండున్నరయ్యింది.

''పిల్లల్ని వదిలేస్తాం. ఆకలికి ఆగలేరు సార్'' వాసుదేవరావు వినయంగా అడిగారు.

''వదిలెయ్యండి! లేకపోతే పుస్తకాలు తినేస్తారు వెధవలు'' అంటూ జోకేసారు. మేం బలవంతంగా నవ్వేశాం.

''ఈ వేళ మా చెడ్డ దాహంగా ఉందయ్యా'' అంటూ బాటిల్‌లోని మిగిలిన డ్రింక్ తాగేశారు.

గంట కొట్టగానే పిల్లలు బిలబిలమంటూ వెళ్ళిపోతున్నారు. ఎమ్మీవోగారు లేచి వరండాలోకి వచ్చారు.

దూరంగా చేతులు కట్టుకుని గౌరమ్మ నిలబడి ఉంది. గౌరమ్మకు ఆఫీసర్లు వస్తే మాట్లాడటం భయం. మేము సైగ చేస్తే నమస్కారం చేస్తుందంతే.

''ఇదిగో నీ పేరేమిటి? పైన సాతోడులు, నేలపై కాగితం ముక్కలు. అంతా చీదరగా ఉంది. కాస్త వొళ్ళు వంచి పనిచెయ్యి. మళ్ళీ నేనొచ్చేటప్పటికి ఇలా ఉండకూడదు'' కండక్టర్స్ ముసిల్ది కావడంచేత ఆమెవైపు చూసి చెప్పడంలేదు.

ఆయన వెనుకగా మేం నడుస్తున్నాం.

గేటు వరకు సాగనంపాం. నమస్కారాలు అందుకొని వెళ్ళిపోయారు.

బడి కాలం ఓ పూట పూర్తయ్యింది.

మేమిద్దరం ఇళ్ళకు బయలుదేరాం, భోజనాలకు.

★ ★ ★

భోజనం చేసి వచ్చేటప్పటికి ఒంటి గంటన్నరయ్యింది. వాసుదేవరావుగారు రాలేదు.

గంట కొట్టించాను. రెండేసి క్లాసులు కలిపి ఏ లెక్కలో చెప్పాలి.

కంగారుగా వాసుదేవరావు వస్తున్నారు.

''పంక్చరయ్యింది. అందుకే ఆలస్యం అయ్యింది'' నుదుటి మీది చెమట తుడుచుకుంటూ లోపలికొచ్చారు.

ఇద్దరమూ కాసేపు ఎమ్మీవో గురించి మాట్లాడుకున్నాం. తరగతులకు బయలుదేరాం.

పిల్లలకు హాజరెయ్యడం పూర్తయ్యింది.

''మాయదారి పిల్లలు... వినాశకాలం వచ్చింది. వీళ్ళ జిమ్మడ...'' తిట్టుకుంటూ లోపలికొచ్చింది ఓ ఆడమనిషి.

కుర్చీలోంచి లేచి బయటకు వచ్చాను.

ఆమె అప్పుడే స్నానం చేసినట్లుంది. ఒళ్ళు తడిగా ఉంది. మేమిద్దరం దగ్గరకెళ్ళాం.

ఎర్రనేత చీర కట్టుకుని రౌద్రంగా ఉంది.

మమ్మల్ని చూసి మరీ రెచ్చిపోయింది.

''మీరసలు సదువులు చెప్తున్నారా? పిల్లల్ని దడిబొక్కలంట చూడమని పంపుతున్నారా? అక్కడ నేను తానం చేస్తుంటే ఒకళ్ళ తర్వాత మరొకళ్ళు వచ్చి చూసి పోవడాలు - ఇకఇకలూ పకపకలూ... అవ్వ! వాళ్ళలో ఆడపిల్లలు కూడా ఉన్నారు'' మగపిల్లలయితే పర్వాలేదన్నట్లు చెప్పుకుపోతున్నది.

ఆవిడ చెప్పే విధానానికి నవ్వు వచ్చింది.

''ఎవళ్ళురా వాళ్ళు'' మా హెడ్‌మాస్టారు గర్జించారు.

చుట్టూ పిల్లలు గుంపులా చేరిపోయారు. ఆమె అందర్నీ పట్టిపట్టి చూస్తున్నది. ఆనవాలు తెలియడం లేదు.

మేము వారిస్తున్నా తిట్లు మానలేదు.

''ఉండమ్మా! కాసేపు నోరు కట్టు. ఇక్కడకొచ్చి అలా మాట్లాడకూడదు'' నేనేదో సర్ది చెప్పబోయాను.

నా మాట వినలేదు. గయ్‌మని లేచింది.

ఈవిడ కేకలు విని బయటనుంచి జనం వచ్చి పోగయ్యారు. విషయమంతా వాళ్ళకు చెబుతూ తిట్లు తిడ్తున్నది.

వాసుదేవరావుగార్కి కోపం వచ్చేసింది. ఆయనకు సాధారణంగా కోపం రాదు.

''ఏమిటీ - నీక్కాదూ చెప్తాంట. ఊరుకుంటున్నానా నీ ఇష్టం వచ్చినట్లు మాట్లాడుతున్నావ్? స్కూలుకొచ్చి న్యూసెన్సు చేస్తున్నావని పోలీసు కంప్లైయింటు ఇస్తాను. వాళ్ళే నీ తిక్క కుదురుస్తారు'' అన్నారు.

వాసుదేవరావుగారి కేసి చూసింది. ఆయన ముఖంలో స్థిరత్వం కనిపించింది.

ఏమనుకుందో సణుక్కుంటూ వెళ్ళిపోయింది. ఇక ఊళ్ళో ప్రచారం మొదలెడ్తుంది. ఉన్నవీ లేనివీ చెప్పి సానుభూతి కోసం ప్రయత్నిస్తుంది.

గొప్ప సమయం వృథా అయ్యింది. పిల్లలకు నాలుగక్షరాలు చెప్పడానికి ఎన్ని అడ్డంకులు వస్తున్నాయో? ''మీరు పోలీసుల పేరు చెప్పడంతో పారిపోయింది. బలే మందు వేశారు'' అన్నాను.

ఆయనేం మాట్లాడలేదు.

గేటు దగ్గర్నుంచి ఓ మనిషి వస్తున్నట్లు కనపడింది. లుంగీ మోకాలుకు మడిచి కట్టుకున్నాడు. తిన్నగా వాసుదేవరావుగారి దగ్గరకు వచ్చాడు. మనిషి వాలకం తాగి వచ్చినట్లుగా ఉంది.

''మావోడు ఆరో తరగతి సదూతున్నాడు. బాగా సదువుతాడు. వాడెలాగూ పెద్దయ్యాక ఆఫీసరవుతాడు. నిన్న బడి నుంచి ఇంటికొచ్చి ఒకటే ఏడుపు. క్లాసులో కొంతమంది దొంగ నా కొడుకుల పిల్లలు కులం పేరుతో హేళన చేస్తున్నారట. మీరేమైనా బుద్ధులు చెప్తారా? నన్నే చెప్పమంటారా? ముందు వాళ్ళను నా ఎదురుగా తీసుకొచ్చి మాట్లాడించండి'' వాసుదేవ రావుగారు అనునయించి పంపడానికి ప్రయత్నించారు. అతను వినలేదు. పెద్ద గొంతుకతో మాట్లాడటం మొదలెట్టాడు.

''ఏమీ కుదర్దంటే కుదరదు. నా సమచ్చంలో వాళ్ళను మందలించి కొట్టాలి. ఆ నా కొడుకుల్ని నేనిపుడే చూడాలి. తాట వలిచేస్తాను ఎదవల్ని ఏమనుకుంటున్నారో'' అతను నాకు పరిచయమున్నవాడే. దగ్గరగా వెళ్ళాను. ''నీవు ప్రస్తుతం స్కూలు నుండి వెళ్ళిపో. బాగోదు. క్రమశిక్షణ మాకు తెలుసు. ఏం చెయ్యాలో చేస్తాం. ఎపుడూ అలా జరక్కుండా చూస్తాం. అనవసరంగా ఇక్కడి వాతావరణం పాడుచెయ్యకు'' అంటూ చెప్పాను.

''నేనసలే రౌడీ నా కొడుకుని. తలుచుకుంటే ఏమైనా చేసేస్తాను. ఇదిగో మీ మాస్టర్ల మాట మీద పోతున్నాను. మళ్ళీగానీ కులాన్ని గేలిచేసి మాట్లాడితే ఒప్పను. నేను మంచివాళ్ళకు మంచివాడిని. చెడ్డవాళ్ళకు చెడ్డవాడిని'' అంటూ తూలుకుంటూ వెళ్ళిపోయాడు.

'అమ్మయ్య' అని నిట్టూర్చాం. వాడి కొడుకుని పిలిపించాం. భయంగా దగ్గరకు వచ్చాడు. వాడితోబాటు చుట్టూ పిల్లలు పోగయ్యారు. వాళ్ళందర్నీ తరగతి గదులకు పొమ్మని పంపించేసం. విషయం తెలుసుకుని కులం పేరుతో దూషించిన ఇద్దరు విద్యార్థుల్ని పిలిపించాం.

'మేం' అనలేదంటూ బుకాయించబోయారు. గట్టిగా తిట్టి బెదిరించేసరికి నిజం చెప్పేసారు. బెత్తంతో కొట్టి ఎప్పుడూ అలా చెయ్యొద్దని చెప్పాం. వాసుదేవరావుగారు దీర్ఘంగా ఆలోచిస్తున్నారు.

''ఏమండోయ్ మాస్టారూ! మీకు చెప్పడం మరిచాను. నిన్న మీరు రాలేదు కదా, రేపేమో మండలాఫీసులో కుటుంబ నియంత్రణ ప్రోగ్రాం గురించి ప్రత్యేక సెంటరట. ఎల్లుండ తెలిసిందే కదా పొదుప గురించి సమావేశం. మనం స్కూలు కట్టేసి వెళ్ళాలి. సోమవారం నుండి నాకు తప్ప మిగిలిన వారందరూ ఓటరు లిస్టులు తయారుచేయాలట. అదొక నెలపాటు జరిగే కార్యక్రమం. అన్నింటికీ టీచర్లే దొరికారు. ఏం చదువులో ఏమిటో? సిన్సియర్‌గా పనిచేద్దామన్నా వీలులేదు. ఈ రోజు చూసారా? పొద్దుట్నుంచి ఎలా సరిపోయిందో!'' వాసుదేవరావుగారు తన బాధ వ్యక్తపరచారు.

నేను కొత్తగా మాట్లాడవలసింది ఏమీ లేదు. పిల్లలు నానా గొడవా మాట్లాడుకుంటున్నారు. టైము నాలుగైంది. మా ఇద్దరికీ నీరసం వచ్చేసింది.

ఆ రోజు విద్యార్థులకు మేము నేర్పిందేమీ లేదు. విద్యాబోధనలో నిత్యం అనేక ప్రతికూలాంశాలు ఎదురవుతున్నాయి. బాధ్యులని ఎవరినీ నిందించనవసరం లేదు.

వాసుదేవరావుగారు గంట కొట్టించేసారు.

ఈలలు వేసుకుంటూ పిల్లలు పరుగెడుతున్నారు.

ఆ వేళ నేర్చుకున్న విజ్ఞానం (?)తో బుర్రలు వేడెక్కినట్లు తలలూపుకుంటూ కబుర్లు చెప్పుకుంటూ పోతున్నారు.

అనేకానేక అవరోధాలతో అన్ని రోజుల్లాగే ఆ రోజూ ఒక పనిదినం పూర్తయ్యింది.

★